దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జూన్ 12 : గ్రూప్-1 అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్ లైన్ http://studycircle.cgg.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, మరిన్ని వివరాలకు 6281766534 ఫోన్ నంబర్‌లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని నర్సింహారెడ్డి ఆ ప్రకటనలో కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

అధికారుల అలసత్వంతో ముందుకు సాగని పనులు

- రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నివేదిక అందిస్తా
- రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల, జూన్ 12 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేయడంలో కాంట్రాక్టర్‌తో నేషనల్ హైవే అధికారులు కుమ్మక్కై పనులు ముందుకు సాగనివ్వడం లేదని రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామిలు ఆరోపించారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ఏళ్లు గడుస్తున్నా.. పూర్తికావడం లేదన్నారు. కాంట్రాక్టర్ మేగా కృష్ణారెడ్డి మొదట్లో కొంత హడావిడి చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, కొందరు స్థానికులు రోడ్డు వెంబడి మర్రి చెట్లు తొలగించొద్దని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారని గుర్తుచేశారు. అయితే, అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ ట్రిబ్యునల్ తీర్పును లెక్కచేయకుండా ధిక్కరిస్తున్నారని వాపోయారు. ఈ రోడ్డు మార్గంలో ఏడాదికి దాదాపుగా 300 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీస్ రికార్డులే చెబుతున్నాయన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మొయినాబాద్, చేవెళ్ల మండలాల్లో ఉన్న బైపాస్ రోడ్డు పనులు సైతం చేయకపోవడం దారుణమన్నారు. రోడ్డు పనులు చేయకుండానే ప్రభుత్వం నుంచి కాలయాపన జరిగిందని, తప్పుడు నివేదిక ప్రభుత్వానికి ఇచ్చి.. లక్షల్లో పరిహారం దండుకునేందుకు మేగా కృష్ణారెడ్డి కుట్రలు పన్నుతున్నారని, ఇంజనీర్లతో నేషనల్ హైవే అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డిని తొందరలోనే కలిసి పూర్తి ఆధారాలతో నివేదిక అందిస్తామని చెప్పారు. డీసీసీ ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి, పెంటారెడ్డి, ఎంపీటీసీ రాములు, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు నర్సింలు, రమేశ్ గౌడ్, బాలయ్య, నాయకులు రాంరెడ్డి, మాణిక్యం, నరేందర్ తదితరులు ఉన్నారు.

వాగులను కబ్జా చేస్తే కఠిన చర్యలు : ఏఈ



కబ్జాకు గురైన పిల్లి వాగులో చేపట్టిన చదును చేసే పనులు

కందుకూరు, జూన్ 12: చెరువులు, కుంటల్లోకి నీరు వెళ్లే వాగులను కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ మండల ఏఈ అబీబ్ తెలిపారు. కందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 974లోని పిల్లి వాగులో కొందరు మట్టిని అడ్డుగా పోశారు. స్థానికులతో కలిసి ఆ గ్రామానికి చెందిన ఎడ్ల ఉదయ్‌కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం వాగులో మట్టిని ఏఈ జేసీబీతో తీయించారు. వాల్టా చట్టం ప్రకారం వాగులను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

జిల్లాలో బడిగంట మోగింది. బుధవారం జిల్లావ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. మొదటి రోజు స్కూళ్లకు విద్యార్థులు చాలా తక్కువగా హాజరయ్యారు. కొన్ని పాఠశాలల్లో అయితే, ఒకే ఒక విద్యార్థి హాజరయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మొదటి రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. విద్యార్థులంతా పాఠశాలలకు రావడంతో అంతా సందడి సందడిగా మారింది. స్నేహితులంతా కలిసి సంతోషంగా గడిపారు.



కొత్తూరు జడ్పీహెచ్‌లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు


సందడి సందడిగా!

విద్యార్థుల రాకతో మొదటిరోజు స్కూళ్లలో కేరింతలు

రంగారెడ్డి అర్బన్, జూన్ 12 : బడి గంట మోగింది. 48 రోజుల తర్వాత పాఠశాలు తిరిగి ప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల్లో ఆట పాటలతో గడిపిన విద్యార్థులు బడిబాట పట్టారు. కొత్త ఆశలు.. కొంగొత్త ఆలోచనలతో నూతన విద్యాసం వత్సరంలోకి విద్యార్థులు అడుగు పెట్టారు. అందంగా ముస్తాబైన పాఠశాలలు పిల్లలకు స్వాగతం పలికాయి. తొలిరోజు ఉత్సాహంగా విద్యార్థులు బడిబాట పట్టారు. విద్యార్థుల రాకతో స్కూళ్లలో సందడి వాతావరణం నెలకొంది. జిల్లాలోని పలు విద్యాలయాల్లో మొదటి రోజు స్కూల్‌కు వచ్చిన చిన్నారులకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. దోస్తులను కలుసుకున్న ఆనందంలో చిన్నారులు కేరింతలు కొట్టారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాలలను సుందరీకరించారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి, అమ్మ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పనులను ప్రారంభించారు. తొలిరోజే ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠ్యపుస్తకాలు అందజేశారు.

మొదటి రోజు హాజరు అంతంతే!

మొదటి రోజు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం చాలా తక్కువగా నమోదైంది. జిల్లాలో 1,45,500మంది విద్యార్థులకు గాను 43,650 మంది మాత్రమే పాఠశాలలకు హాజరయ్యారు.30 శాతం హాజరు నమోదైంది. యాచారం మండలం మేడిపల్లిలో తరగతి గదులు మరమ్మత్తు కారణంగా టెంట్లు వేసి ఉపాధ్యాయులు పాఠాలు చెప్పారు. శంకర్‌పల్లి మండలం రామాంతపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఒకే ఒక విద్యార్థి హాజరయ్యారు. యాచారం ఉన్నత పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా హాజరు కాలేదు. ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాలలో మొదటి రోజు విద్యాబోధన జరగకపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే గడిపారు. కేశంపేట మండలం నిర్దవెల్లి ఉన్నత పాఠశాలలో మొదటి రోజే టాయిలెట్లు, తరగతి గదులకు మరమ్మతులు చేపట్టారు. దీంతో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేసి వెంటనే ఇంటికి పంపించారు.



శంకర్‌పల్లి : రామాంతాపూర్ పాఠశాలకు వచ్చిన ఒకే విద్యార్థి



ఆమనగల్లు : విద్యాబోధన లేక పోవడంతో బయట కూర్చున్న విద్యార్థులు



కేశంపేట : నిర్దవెల్లి పాఠశాలలో జరుగుతున్న మరమ్మతులు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- జడ్పీ చైర్‌పర్సన్ అనితా హరనాథ్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్, జూన్12: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ జరుగుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చదువుకుంటేనే కుటుంబాలు బాగుపడతాయని, ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, కలెక్టర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ చరిత్రాత్మకమైన మొగిలిగిద్ద పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. గత పాలకులు విద్యను నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా మొదటి రోజే విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని తెలిపారు. గొప్ప చరిత్ర ఉన్న మొగిలిగిద్దను నాటి పాలకులు మండలం లేకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, టాయిలెట్స్ ఉండాలనే ఉద్దేశంతో సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన చదువులు అందుతాయని, తాను కూడా ప్రభుత్వ బడిలోనే చదివి ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేశారు. ప్రభుత్వ బడులు బలోపేతం కావాలంటే అందరి సహకారం ఉండాలని అభిప్రాయపడ్డారు. జిల్లాలోని 25 పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని, అది అందరికీ గర్వంగా ఉందన్నారు. పలు పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, కలెక్టర్ అభినందించారు. అలాగే దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈవో సుశీందర్‌రావు, జడ్పీటీసీ సభ్యుడు వెంకట్రాంరెడ్డి, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో బన్సీలాల్, ఎంఈవో శంకర్ రాథోడ్, హెచ్‌ఎం రమేష్ బాబు, గ్రామస్తులు శ్యాంసుందర్, సిరాజుద్దీన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 12 : మున్సిపాలిటీల్లో జరుగుతున్న నాలా పనులకు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ (ఎస్ఎన్‌డీపీ) పనుల వేగవంతంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నాలా ప్రాజెక్టు కింద జరుగుతున్న పలు కాలువ పనులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రణాళికలు తయారు చేసి వాటి వివరాలు అందజేయాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలా పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటే స్థానికులకు ముంపు సమస్య ఉండదని, ప్రాణనష్టం వంటివి వాటిల్లకుండా ఉంటుందన్నారు. వచ్చే వర్షాల ద్వారా పౌరులు ఇబ్బందులు ఎదురు కాకుండా ప్రమాదాలను నివారించడానికి సైట్ల వెంట హెచ్చరిక బోర్డులు, మొబైల్, మినీ మొబైల్ స్టాక్ టీములను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నాలా పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారి యంత్రాంగం పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. వర్షాలు కురిసినా పనులకు అంతరాయం కలగకుండా కొనసాగించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు.. యమ డేంజర్!

- తరచూ ప్రమాదాలు
- గాయాల బారిన వాహనదారులు
- రాత్రివేళల్లో ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు

కేశంపేట, జూన్ 12 : షాద్‌నగర్-మక్తమాదారం ప్రధాన రహదారిపై ఓ కల్వర్టు వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయంలో కల్వర్టు మూలమలుపు కనబడక పక్కనే ఉన్న పొలాల్లోకి వాహనాలు దూసుకెళ్లి ఎందరికో తీవ్ర గాయాలైన సంఘటనలున్నాయి. కాగా, కొన్నేళ్ల క్రితం షాద్‌నగర్-మక్తమాదారం ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఈ దారిలో తులవానిగడ్డ సమీపంలో మూల మలుపుతో కూడిన కల్వర్టు ఉంది. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనాలు కల్వర్టు సమీపంలో వేగాన్ని అదుపు చేయలేక కల్వర్టు దిమ్మెలను ఢీకొనడంతో గాయాలపాలవుతున్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న పొలాల్లోకి వాహనాలు దూసుకెళ్లడంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. రాత్రి సమయంలో ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన ఓ యువకుడు ఇటీవల కల్వర్టు కనబడక ప్రమాదానికి గురై గాయాలపాలై చికిత్స పొందుతూ చనిపోయాడు. గడ్డిలోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ముందు ఉన్న దారిని అంచనా వేయకుండా వెళ్లడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ కూలీ మృతిచెందాడు. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పదిరోజుల క్రితం ఈ కల్వర్టుపైన రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో వేములనర్వకు చెందిన శేఖర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇలా నిత్యం కల్వర్టుపై ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

తులవాని గడ్డ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ దారిలో కొత్తగా వెళ్లే వాహనదారులు మూల మలుపును అంచనా వేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టు వద్ద ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- రొల్లు రాఘురాములు గౌడ్, కేశంపేట

'డబుల్' ఇళ్లు.. నిరుపయోగం!

- ప్రారంభించి ఎనిమిదేళ్లు.. అసంపూర్తిగా పనులు
- లబ్ధిదారుల ఆందోళన.. జాప్యం చేస్తున్న సర్కార్
- శంకర్‌పల్లి పరిధిలో 9.33 ఎకరాల్లో 1,512 ఇళ్లతో సముదాయం నిర్మాణం



శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం

శంకర్‌పల్లి, జూన్ 12 : పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిరుపయోగంగా మారాయి. లబ్ధిదారులకు కేటాయించినా.. అసంపూర్తి పనులతో ఎవరూ నివాసం ఉండకపోవడంతో వెలవెలబోతున్నాయి. వివరాల్లోకి వెళితే.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం పక్కన 9.33 ఎకరాల ప్రభుత్వ స్థలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక నిర్మాణం ప్రారంభించి 2023లో పూర్తి చేసింది. కాగా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులు రూ.130కోట్ల79లక్షలతో మొత్తం 1,512 ఇళ్లను 14 బ్లాకులుగా నిర్మించారు. ఒక్కో బ్లాకులో 108 ప్లాట్ల(రెండు పడక గదుల ఇళ్ల)ను నిర్మించారు. అందులో 1,275 ఇళ్లను నగరంలోని కార్వాన్ నియోజవర్గంలోని లబ్ధిదారులకు, 86 ఇళ్లను నగరంలోని యాకత్‌పురా నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కేటాయించారు. ఎమ్మెల్యే కోటాలో చేవెళ్ల నియోజకవర్గంలోని స్థానికులకు 151 ఇళ్లను కేటాయించారు. అయితే, నగరంలోని లబ్ధిదారులకు కేటాయించిన 1,361 ఇళ్లకు 2023 సెప్టెంబర్‌లోనే రంగారెడ్డి కలెక్టరేట్‌లో పట్టాలను పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడి చేసి అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యల చేతుల మీదుగా 2023 అక్టోబర్ 2న డబుల్ బెడ్‌రూమ్‌లను ప్రారంభించి బ్లాకులను కేటాయించారు. నియోజకర్గంలోని స్థానికులకు కేటాయించిన 151 ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పటివరకు చేపట్టలేదు. కాగా, అందులో 15వ బ్లాకును స్థానికుల కోసం కేటాయించినట్లు సమాచారం. అయితే, అధికారులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో భాగంగా పూర్తిస్థాయిలో సౌకర్యాలను కల్పించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదు. బాత్‌రూమ్‌లలో పూర్తిస్థాయిలో శానిటేషన్ పనులు చేపట్టలేదు. డ్రైనేజీ నీరు బయటకు వెళ్లేందుకు పైపులను కూడా ఏర్పాటు చేయలేదు.

కోట్లాది రూపాయలతో నిర్మాణం

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించి దాదాపుగా 8నెలలు పూర్తి కావస్తున్నా.. అందులో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఎవరూ నివాసం ఉండటం లేదు. అదేవిధంగా కోట్లాది రూపాయలతో నిర్మించిన ఇళ్లు వృథాగా ఉండిపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానికులకు కాకుండా స్థానికేతరుల(నగరంలోని లబ్ధిదారులు)కు కేటాయించడంతో వారు ఇక్కడికి రావడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించడంలో జీహెచ్ఎంసీ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

మిగతా బ్లాకుల పనులు పూర్తయ్యేనా?

ఒకటి నుంచి ఏడు బ్లాకులను అరకొర వసతులతో పూర్తిచేసిన అధికారులు.. మిగతా 8 నుంచి 14వ బ్లాకుల్లో పనులు పూర్తిచేయడానికి ఇంకెంత సమయం తీసుకుంటారో తెలియక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఒకటి నుంచి ఏడు బ్లాకులలో పనులను పూర్తి చేయడానికి సుమారు 8 నెలల సమయం తీసుకున్న అధికారుల పనితీరుపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. రెండు నెలల్లో మిగతా బ్లాకుల్లో పనులు పూర్తిచేసి ఇళ్లను అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నా లబ్ధిదారుల్లో సందేహం మాత్రం తీరడం లేదు. జీహెచ్ఎంసీ అధికారులు తొందరగా పనులు పూర్తిచేసి ఇల్లులేని లోటును తీర్చాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న చేవెళ్ల నియోజకవర్గంలోని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి స్థానికులకు ఇళ్లు కేటాయించాలని కోరుతున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ ఏఈ రామకృష్ణని వివరణ కోరగా.. మిషన్ భగీరథ నీళ్లు రావడానికి ఆలస్యమైందని, నెల రోజుల క్రితమే నీటి కనెక్షన్ ఇచ్చామన్నారు. లబ్ధిదారులకు ఫోన్‌చేసి ఇళ్లలో ఉండేందుకు సమాచారం ఇచ్చామని తెలిపారు. అయితే, ఇప్పటివరకు కేవలం 20 కుటుంబాలు మాత్రమే వచ్చి వారికి కేటాయించిన ఇళ్లలో ఉంటున్నారని, మిగతావారు ఈనెలాఖరు వరకు వచ్చే అవకాశం ఉందన్నారు. కాగా, 7 నుంచి 14వ బ్లాకుల పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. జెన్‌కో అధికారులు అనుమతిస్తే రోడ్డు పనులు సైతం ప్రారంభిస్తామన్నారు.

లబ్ధిదారుల ఎంపిక వెంటనే చేపట్టాలి



చేవెళ్ల నియోజకవర్గ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అధికారులు వెంటనే చేపట్టాలి. నగరంలోని లబ్ధిదారుల ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ స్థానికుల ఎంపికలో జాప్యం ఎందుకు జరుగుతోంది. ఇల్లు లేని నిరుపేదలు శంకర్‌పల్లిలో ఎంతో మంది ఉన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు స్థానికంగా ఉన్న పేదలకు వెంటనే కేటాయించాలి.

- జె. శ్వేతా పాండురంగారెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్, శంకర్‌పల్లి

వసతులు కల్పిస్తే ఇక్కడే ఉంటాం



నా భార్య అమ్రీన్ ఖాతూన్ పేరున ఇల్లు మంజూరైంది. 7వ బ్లాకులో 101 నెంబర్ ఇల్లును అధికారులు కేటాయించారు. సెంట్రింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో త్వరగా పనులు పూర్తిచేస్తే నా కుటుంబంతో వచ్చి ఇక్కడే ఉంటాను.

- మహమ్మద్ ఇర్ఫాన్, టోలిచౌకి

పనులు త్వరగా పూర్తి చేయాలి



నా పేరుపై 12వ బ్లాకు 307 నెంబర్ గల ఇల్లు కేటాయించారు. నాభర్త ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తాడు. మాకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఇంటి పనులు పూర్తికావడానికి మరో రెండు మూడు నెలలు పడుతుందని అధికారులు చెబుతున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలి.

- గోదా నాగమణి, జియాగూడ

'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్'కు విద్యార్థుల ఎంపిక

కొడంగల్, జూన్ 12: కొడంగల్‌లోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు 8మంది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద భువనగిరి గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శంకర్‌బాబు బుధవారం తెలిపారు. ఏడో తరగతి విద్యార్థులు ఇటీవలే జరిగిన ఎస్‌వోఈ ప్రవేశపరీక్ష రాసి ప్రతిభ కనబర్చడంతో ఈ అవకాశం లభించిందన్నారు. ఈ విద్యార్థులకు ఇంటర్మీడియెట్ వరకు నీట్ లెవల్‌లో బోధన అందిస్తారన్నారు.

వేద పాఠశాలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శామీర్‌పేట, జూన్ 12 : శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ రామభద్ర క్షేత్రంలో గల శ్రీరామభద్ర సంస్కృత వేద పాఠశాలలో ఈ సంవత్సరం చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బుధవారం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్కృత వేద పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. శ్రీరామభద్ర వేద సంస్కృత పాఠశాలలో చేరేందుకు ఉపనయం పూర్తయి 12సంవత్సరాల లోపు వయసున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆ పాఠశాల ఫోన్ నంబర్ 9985559791ను సంప్రదించాలని వారు కోరారు.



పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలను చూయిస్తున్న ఎస్ఐ శ్రీశైలంయాదవ్, ఏవో

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

దౌల్తాబాద్, జూన్ 12: నకిలీ పత్తి విత్తనాలు ప్రతీ సంవత్సరం రైతులను నట్టేటా ముంచుతున్నాయి. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని కుదురుమళ్ల గ్రామంలో కమ్మరి వెంకటేశ్ ఇంట్లో ఏవో లావణ్య, ఎస్సై శ్రీశైలం యాదవ్‌తో కలిసి తనిఖీ చేశారు. 19 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా ప్రతీ సంవత్సరం ఏపీ రాష్ట్రం నెల్లూరు జిల్లా ప్రాంతానికి చెందిన వ్యాపారులు కొడంగల్ ప్రాంతంలో పొలాలను లీజుకు తీసుకొని గ్రామాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఈక్రమంలో కొంత మంది అమాయక రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని వారి ఇళ్లలో పత్తి విత్తనాలు నిల్వ ఉంచి వ్యాపారాన్ని గుట్టుగా కొనసాగిస్తున్నారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

22న హెచ్‌సీఏ టాలెంట్ హంట్



హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఫాస్ట్ బౌలర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ప్రత్యేకంగా టాలెంట్ హంట్ నిర్వహిస్తోందని కార్యదర్శి దేవ్‌రాజ్ తెలిపారు. ఈనెల 22వ తేదీన ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టాలెంట్ హంట్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల క్రికెటర్లు వచ్చే శుక్రవారం ఉదయం 10గంటల నుంచి తమ పేర్లను హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్‌లో (www.hycricket.in) నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఈ ప్లేయర్లు గతంలో హైదరాబాద్ జట్టుకు కానీ, బీసీసీఐకి ఆడిన వారై ఉండకూడదని, ఈ టాలెంట్ హంట్ పూర్తిగా కొత్త వాళ్లకు కోసం చేపడుతున్నామని దేవ్‌రాజ్ పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి : ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం, జూన్ 12: విద్యార్థులు, యువత డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. ఒక్కసారి డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే ఇక వారి జీవితం అంధకారమవుతుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం పటిష్టమైన నిఘా ఉంచిందని, ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సిందేనని అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ మధ్య కాలంలో డ్రగ్స్, గంజాయి వంటి నిషేధిత పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠాలను గుర్తించి కటకటాల వెనక్కి పంపిన విషయం గుర్తెరగాలన్నారు. సదస్సులో సీఐ సత్యనారాయణ, గురునానక్ విద్యా సంస్థల డైరెక్టర్ కె.వెంకట్రావు, జాయింట్ డైరెక్టర్ డా.పి.పార్థసారథి, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ డా.రిషిసాయల్, డీన్ డా.సంజీవ్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలి

రంగారెడ్డి అర్బన్, జూన్ 12 : మిషన్ భగీరథ సర్వే నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీలను మిషన్ భగీరథ సర్వే నుంచి మినహాయిస్తూ నిర్దిష్టమైన ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యూనియన్ నాయకులురాళ్లు బి.కవిత, బి.రాజ్యలక్ష్మి, వైదేవి, కృష్ణ, పద్మ, బాలమణి తదితరులు ఉన్నారు.



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలి

- ఆ తర్వాతనే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్

ఆమనగల్లు, జూన్ 12: రాష్ట్రంలో కులగణన చేపట్టి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేయాలని కోరుతూ ఈనెల 15న ఇందిర పార్క్ దగ్గర బీసీల మహా ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం మహాధర్నా విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బీసీ జనసభ, బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. మహాధర్నాకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీసీ జనసభ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, వివిధ సంఘాల నాయకులు కోట శ్రీనివాస్, రఘు, దోనాదుల కుమార్‌లతో కలిసి రాజారాం యాదవ్ ఆవిష్కరించారు. రాజారాం మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా అడ్డుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కులగణన నిర్వహించడం లేదని ఆరోపించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కులగణన చేస్తామని ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ చెప్పినందుకే కాంగ్రెస్‌కు ఎంపీ సీట్లు పెరిగాయన్నారు. టీ-జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకుడు దోనాదుల కుమార్, పద్మశాలి సంఘం గౌడ సంఘం, రజక సంఘం, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులున్నారు.

లక్ష్మాపూర్ భూ సమస్య పరిష్కరించాలి

మూడుచింతల్లి, జూన్ 12 : మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో భూ సమస్యలు పరిష్కరించాలని లక్ష్మాపూర్ నాయకుడు క్యాతం మధుకృష్ణ బుధవారం ఎంఎల్‌ఏ క్వార్టర్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా లక్ష్మాపూర్ గ్రామ భూములకు నక్షలేక ఇబ్బందులు పడుతున్నారని, రికార్డుల్లో ఎక్కక రైతుబంధు, పథకం అందలేదన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ రీసర్వే చేయిస్తామని చెప్పి చేయలేన్నారు. గ్రామ భూములకు నక్ష లేకపోవడంతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మూడుచింతలపల్లి మండల కార్యాలయాలకు ఒక్క సొంత భవనమైనా లేదన్నారు. లక్ష్మాపూర్-మూడుచింతలపల్లిని సంయుక్తంగా మండలంగా ప్రకటించాలని సీఎంను కోరారు. రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి త్వరలోనే భూ సమస్య పరిష్కరిస్తామని చెప్పారని ఆయన తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మధుకృష్ణ

'బెస్ట్ అవైలబుల్ స్కూల్'కు 36 మంది విద్యార్థుల ఎంపిక

వికారాబాద్, జూన్ 12 : బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 2024-25 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ స్కూళ్లకు 36 మంది ఎస్టీ విద్యార్థులను ఎంపిక చేశారు. 3వ, 5వ, 8వ తరగతుల్లో అడ్మిషన్ కోసం 60మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, డ్రా తీసి 36మందిని ఎంపిక చేశారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ డ్రా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచితంగా రెసిడెన్షియల్ విద్య అందిస్తామని ఎస్టీ వెల్ఫేర్ అధికారి మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో ఏవో భువనేశ్వరి, సిబ్బంది విజయకుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.



డ్రా తీసి విద్యార్థులను ఎంపిక చేస్తున్న లింగ్యానాయక్

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

- పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- అధికారులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు
- మొదటిరోజు బడిబాట పట్టిన విద్యార్థులు
- యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందజేత
- కొన్ని స్కూళ్లలో అరకొర సౌకర్యాలు!



ఆమనగల్లు : విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మంచాల : జెడ్పీహెచ్ఎస్‌లో యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి



మహేశ్వరం : విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం, జూన్ 12 : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరగాలని ప్రభుత్వం అన్ని సదుపాయాలను కల్పిస్తుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపీపీ ఆర్.సునిత అంద్యానాయక్, ఎంఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, ఎంపీపీ అనితవిజయ్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలతో కలిసి వివిధ ప్రభుత్వ బడుల విద్యార్థులకు ఎమ్మెల్యే యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కమిషనర్ వసంత, ఎంపీటీసీలు కుమార్, మంగమ్మ నారాయణ, తదితరులున్నారు. పలు చోట్ల టీచర్లు, విద్యార్థులు పాఠశాలలను శుభ్రం చేసుకోవడం కన్పించింది. ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాలలో 300 మందికి 20 మంది మాత్రమే హాజరయ్యారు. కొన్ని పాఠశాలల్లో ఒకరిద్దరు విద్యార్థులే రావడం గమనార్హం. పాత సమస్యలతోనే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. పలు పాఠశాలలను ఎంఈవో సర్దార్‌నాయక్ సందర్శించారు. ఆమనగల్లు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులచే ప్రార్థన చేయించారు.

కందుకూరు : ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యార్థులకు మౌలిన వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని జడ్పీటీసీ జంగారెడ్డి, ఎంపీపీ జ్యోతిలు అన్నారు. మండలంలోని 54 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బాగాంధీ బదిరుల, ఆదర్శ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో సరిత, ఎంఈవో మనోహర్‌లతో కలిసి వారు తిమ్మాయిపల్లి ప్రాథమమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. మండలంలో 35 గ్రామ పంచాయతీల్లో 54 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 50శాతం మంది మాత్రమే హాజరయ్యారు. వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మహేష్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు వై.శ్రీశైలం, తదితరులున్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని గూడూరు ప్రధానోపాధ్యాయుడు వి.కిషన్ కోరారు. విద్యాకమిటీ చైర్మన్ లావణ్యతో కలిసి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. ఉపాధ్యాయులు ఎండీ అయూబ్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని 54పాఠశాలలను ప్రారంభించి పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు.

ఇబ్రహీంపట్నం : మండలంలో పాఠశాలల్లో మొదటి రోజు విద్యార్థుల హాజరు 50 శాతం లోపే ఉంది. పలు పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. బడిబాట సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ బడీడు పిల్లల తల్లిదండ్రులను కలిసి అడ్మిషన్లు చేయిస్తున్నారు.



షాబాద్ : బాలుర ఉన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

యాచారం : మండలంలోని 12 ఉన్నత, 6 ప్రాథమికోన్నత, 32 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 4,080 మంది విద్యార్థులున్నారు. బుధవారం 400 మంది పాఠశాలలకు వచ్చారు. యాచారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తప్ప ఒక్క విద్యార్థి హాజరుకాలేదు. ప్రాథమిక పాఠశాలలో 9 మంది మాత్రమే వచ్చారు. వివిధ గ్రామాల్లోని బడుల్లో ప్రత్యేకాధికారులు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలందించారు. ఏ ఒక్క గ్రామంలో కూడా మధ్యాహ్న భోజనం పెట్టలేదు. మధ్యాహ్న భోజన కార్మికులు వంట పాత్రలు శుభ్రం చేసుకున్నారు. మేడిపల్లి ఉన్నత పాఠశాలను అమెజాన్ సంస్థ దత్తత తీసుకుంది. దాంతో నాలుగు రోజులుగా తరగతి గదుల్లో షాబాద్ బండలు తొలగించి మార్బుల్ వేయడానికి పనులు చేస్తున్నారు. తరగతి గదుల స్లాబ్‌పై ఫ్లోరింగ్ చేస్తున్నారు. టీచర్లు కొంతమంది గ్రామస్తులు టెంట్‌వేసి విద్యార్థులతో సమావేశమయ్యారు. పుస్తకాలు, నోట్‌బుక్‌లందజేశారు.

మంచాల : మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్, ప్రైమరీ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఏపీఎం శోభ, సీసీ జైపాల్‌రెడ్డి, హెచ్ఎంలు నారాయణరెడ్డి, సుగంధ, ఝూన్సీ, కోఆప్షన్ సభ్యులు బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. చిత్తాపూర్‌లో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బి.నాగరాజు, యాదయ్య, సత్యనారాయణ, కృష్ణ, రమేష్, ప్రధానోపాధ్యాయులు ముంతాజ్, పాండు, మల్లేష్ తదితరులున్నారు.

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మండలంలోని పాఠశాలలు మొదటి రోజే తూతూ మంత్రంగా నడిచాయి. రామంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు నర్సింలు, గిరిజ ఉండగా, నర్సింలు హాజరుకాగా ఉపాధ్యాయురాలు గిరిజ సంపాదిత సెలవు పెట్టి సాయంత్రం పాఠశాలకు వచ్చింది. పాఠశాలలో 14 మంది విద్యార్థులు ఉండగా, 5వ తరగతి చదువుతున్న శివ అనే విద్యార్థి ఒక్కడే హాజరయ్యాడు. పత్తేపురం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు సుధారాణి, శ్వేతలు ఉండగా, సుధారాణి హాజరైంది. శ్వేత అనే ఉపాధ్యాయురాలు గణేష్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో డిప్యుటేషన్‌పై పనిచేస్తుంది. మొత్తం 35మందికి 8మంది విద్యార్థులే హాజరయ్యారు. మోకిలతండా పాఠశాలలో మరుగుదొడ్ల పనులు పూర్తి కాలేదు. ఇంకా పనులు అసంపూర్తిగానే మిగిలాయి. బుల్కాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మరుగుదొడ్లకు తలుపులే లేవు. శంకర్‌పల్లి మండలంలో 11 ఉన్నత, 10 ప్రాథమికోన్నత, 33 ప్రాథమిక పాఠశాలలున్నాయి. పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయగా, నోట్ పుస్తకాలు రాలేదు.

మొయినాబాద్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీపీ నక్షత్రం జయవంత్, ఎంపీడీవో సంధ్య అన్నారు. మండలంలోని పాఠశాలలను తనిఖీ చేసిన ఎంపీపీ, ఎంపీడీవోలు బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. అజీజ్‌నగర్, కనకమామిడి తదితర పాఠశాలల్లో విద్యార్థులకు వారు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు.

షాబాద్ : ప్రభుత్వ పాఠశాలలు గ్రామాలకు పట్టుకొమ్మలు అని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్ రెడ్డి అన్నారు. హైతాబాద్, సంకేపల్లిగూడ, సర్దార్‌నగర్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. అనంతరం టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఎంపీడీవో అపర్ణ, ఎంపీటీసీ చెన్నయ్య ప్రధానోపాధ్యాయులు వసంత, లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, షాబాద్ మండలంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదైంది. వచ్చిన విద్యార్థులచే టీచర్లు సమయానికి ప్రార్థనలు చేయించారు.

చేవెళ్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో పాఠశాలలు ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, ఎంఈవో అక్బర్, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. చేవెళ్ల మండలంలోని అన్ని పాఠశాలల్లో మొదటిరోజు విద్యార్థుల సంఖ్య చాలావరకు తక్కువగా నమోదైంది. కాగా, అక్షయపాత్ర సంస్థ ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు.

ఆదిభట్ల : మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి ఆదిభట్ల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు హెచ్ఎంలు భారతి, పరమేష్‌లతో కలిసి గులాబీ పువ్వులతో స్వాగతం పలికారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఉపాధ్యాయులు బుచ్చయ్య, బబ్లీ, ఇందిర, మమత పాల్గొన్నారు. కాగా, పాఠశాలలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించి విద్యార్థులకు వినూత్న రీతిలో స్వాగతం పలికారు. మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలో విద్యార్థులు 25 శాతం మాత్రమే హాజరయ్యారు. పాఠ్యపుస్తకాలు, యూనిపాం అందజేశారు.

నందిగామ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీపీ ప్రియాంక శివశంకర్‌గౌడ్ అన్నారు. చేగూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలసి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూర్ : అన్ని పాఠశాలల్లో సమయానికి ఉపాధ్యాయులు చేరుకున్నారు. విద్యార్థులచే ప్రార్థనలు చేయించారు. విద్యార్థులకు యూనిఫాం, నోటుబుక్‌లు అందజేశారు. 20శాతం మంది విద్యార్థులు మాత్రమే మొదటి రోజు హాజరైనారు. ఇన్ముల్‌నర్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి, కొత్తూర్ ఉన్నత పాఠశాలలో చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్‌లు యూనిఫాం, నోటుబుక్‌లు అందజేశారు. కార్యక్రమాల్లో వైస్‌ఎంపీపీ శోభలింగంనాయక్, ఎంపీడీవో అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు : వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక, దళితవాడ ప్రాథమిక, బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్లతో కలిసి పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శంకర్ రానున్నారని చిన్నారులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. చివరకు నాయకులు, అధికారులు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఎంపీడీవో ఆంజనేయులు, ఎంఈవో కిష్టారెడ్డి, హెచ్ఎంలు వరప్రసాద్, ప్రేమ్‌సాగర్, వెంకట్‌రెడ్డి, ఏపీఎం జయమాలిని, తదితరులున్నారు.

కేశంపేట : జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్‌లు అందించారు. తహసీల్దార్ ఆజంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంఈవో మనోహర్, ఎంఎస్‌వో చంద్రశేఖర్, కాంప్లెక్స్ హెచ్ఎం విద్యావతి, పాఠశాల హెచ్ఎం అప్పరావు, తదితరులున్నారు. మండలంలోని ప్రభుత్వ బడుల్లో 3,128 మందికి 350 నుంచి 400మంది హాజరయ్యారు. కొత్తపేట, కేశంపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అయితే పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంఈవో మనోహర్, పంచాయతీ రాజ్ ఏఈ భూపాల్‌లు పనులను పరిశీలించారు.



కందుకూరు : తిమ్మాయిపల్లి పాఠశాలలో పుస్తకాలు అందిస్తున్న జడ్పీటీసీ జంగారెడ్డి, ఎంపీపీ జ్యోతి



నందిగామ : చేగుర్ జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రియాంక



ఆదిభట్ల : విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్ : అజీజ్‌నగర్ పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నక్షత్రం జయవంత్, ఎంపీడీవో సంధ్య



కొందుర్గు : పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్



ఇబ్రహీంపట్నం : ఎంపీ పటేల్‌గూడ స్కూల్లో పుస్తకాలు అందజేస్తున్న కౌన్సిలర్ రాములు



యాచారం : చింతపట్ల ప్రాథమిక పాఠశాలలో..



చేవెళ్ల : బాలికల పాఠశాలలో పుస్తకాలు అందిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు : వీర్లపల్లి



చౌదరిగూడ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

చౌదరిగూడ, జూన్ 12: గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. వీర్లపల్లి మాట్లాడుతూ.. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే అభివృద్ధి పనులు పురోగతి జరుగుతుందన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులు నోటీసులు అందజేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు సూచించారు. ఎన్నికల కోడ్ కారణంగా రూ.కోటి 75 లక్షల అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించనున్నటు ఎమ్మెల్యే వివరించారు. మండలానికి అదనంగా మరో రూ.3కోట్ల నిధులు మంజూరు చేసేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. వైస్ ఎంపీపీ ఆశ్రబేగం, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్ తోపాటు ఇతర అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కొందుర్గు : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు మందిరంలో ఎంపీపీ జంగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ భవన స్థలంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారని, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతానని, అలాగే మండలానికి స్టేడియం ఏర్పాటు కోసం కృషి చేయడం జరుగుతుందని, త్వరలోనే మంజూరు అవుతాయని అన్నారు. షాద్‌నగర్ నుంచి పరిగి వరకు ఉన్న రోడ్డును 4 లైన్ల రోడ్డుగా ఏర్పాటు చేసేందుకు గాను పరిగి ఎమ్మెల్యేతో కలిసి తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలువడం జరిగిందని, త్వరలోనే 4 లైన్ల రోడ్డు మంజూరు కానుందని అన్నారు. జడ్పీటీసీ రాగమ్మ, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, సింగిల్ విండో చైర్మెన్ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీలు బి.మంజుల, ఇస్తారమ్మ, దేవి, ఎంపీడీవో అంజనేయలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ నేత జన్మదిన వేడుకలు

శంషాబాద్ రూరల్, జూన్ 12 : మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ పారేపల్లి లావణ్య భర్త బీఆర్ఎస్ నేత పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ 58వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలతో పాటు వివిధ పార్టీలకు చెందినవారు కేక్‌లు కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్, పరమేష్‌గౌడ్, రాజుగౌడ్, సుదర్శన్‌గౌడ్, పెంటయ్య, అశోక్‌గౌడ్, త్రిశాల్‌గౌడ్, రంజిత్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, కర్నాకర్‌గౌడ్, రాజుగౌడ్, శేఖర్‌గౌడ్, నరేందర్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌గౌడ్‌కు కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ నేతలు

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి



పోచారంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూన్ 12: గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధిలోకి తీసుకెళ్లేందుకు తగు కార్యాచరణతో ముందుకు పోతున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం మండల పరిధి తుర్కగూడ నుంచి పోచారం మీదుగా కొంగరకలాన్ వరకు పీఎంజీఎస్‌వై కింద రూ.4.76 కోట్లతో నిర్మాణం చేసిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అలాగే పోచారంలో రూ.19.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.25 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఉప్పరిగూడలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎంపీపీ కృపేష్, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ గుర్రం ఇంద్రసేనా రెడ్డి, ఎంఈవో కె.వెంకట్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి వరప్రసాద్‌రెడ్డి తదితరులున్నారు. అంగన్‌వాడీల్లో లబ్ధిదారులకు సంబంధించి మెడికల్ కిట్లను ఎమ్మెల్యే మల్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రత్యేక సందర్భాల్లో అంగన్‌వాడీ టీచర్లు వేసుకునే యూనిఫాంను కూడా అందజేశారు. ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో జి.శాంతిశ్రీ, మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ బర్ల మంగ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, పల్లవి, సరళ, కల్పన, సత్యమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

- జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

మంచాల, జూన్ 12 : హరితహారం మొక్కల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లాపరిషత్ సీఈవో కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మంచాలలో నర్సరీ, పల్లెప్రకృతి వనం, క్రీడాప్రాంగణం, గ్రామపంచాయతీలను సందర్శించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో విధిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతిమొక్కను సంరక్షించుకునేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, వీధులు, మురుగుకాల్వల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా

కొత్తూర్, జూన్ 12: ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబా ఆధ్వర్యంలో ఆశావర్కర్లు స్థానిక పీహెచ్‌సీ జూనియర్ డాక్టర్ ఝాన్సీకి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఆశాకార్యకర్తల సమస్యలపై నేడు(గురువారం) నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశాలు అనిత, చైతన్య, మహేశ్వరి, బుజ్జి, కవిత, శశిరేఖ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

11 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, జూన్ 12 : మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో బుధవారం రాచకొండ ఎస్వోటీ పోలీసులు దాడులు చేసి 11క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన గురుప్రసాద్ ఇంట్లో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం అందుకున్నారు. బుధవారం ఉదయం దాడిచేసి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని యాచారం పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

చౌదరిగూడ,జూన్ 12: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రాథమిక పాఠశాలలో(ఎస్జీటీ) పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తర్నికంటి జగన్ గుండె పోటుతో మృతిచెందాడు. బుధవారం రాత్రి 12గంటల సమయంలో గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు షాద్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి జగన్ మృతిపట్ల మండల నాయకులు, లక్ష్మీదేవిపల్లి గ్రామస్తులు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. కాగా, జగన్ నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందినవారు. షాద్‌నగర్‌లో నివాసముంటారు.

పథకాల అమలుతో ప్రజలకు చేరువైన కాంగ్రెస్

ఆమనగల్లు, జూన్ 12: ఆరు గ్యారంటీల, హామీల అమలుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించిన మల్లు రవికి బుధవారం ఆమనగల్లు పట్టణంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుర్రం కేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మల్లు రవిలను నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డితో కలిసి తన వంతు కృషి చేస్తానని రవి హామీ ఇచ్చారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, పీసీసీ కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులున్నారు.

ఘనంగా విజయ్ రాథోడ్ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే కసిరెడ్డితో కలిసి కేక్‌కట్ చేస్తున్న విజయ్‌రాథోడ్

ఆమనగల్లు, జూన్ 12: కేఎన్ఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ జన్మదిన వేడుకలు బుధవారం ఆమనగల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో కలిసి విజయ్‌రాథోడ్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విజయ్‌రాథోడ్‌ను పలువురు సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, జిల్లా నాయకులు మండ్లీ రాములు, ఎగిరిశెట్టి సత్యం, ఎంపీటీసీ నిట్ట మంగమ్మ నారాయణ, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంఏ ఖలీల్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, కృష్ణనాయక్, బాబా, అలీం, శ్రీశైలం, నాజర్, ఫరీద్, పర్వతాలు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : ఏపీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమనగల్లు మండలం నుంచి టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు విజయవాడకు తరలారు. సీఎం చంద్రబాబు, మంత్రులు పవన్ కళ్యాణ్, తదితరులను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపినట్లు యాదిలాల్ చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో జిల్లా నాయకుడు కొప్పు యాదయ్య ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు.

కొత్తూర్ : మున్సిపాలిటీలో గ్రామ దేవతల ఆలయాల నిర్మాణాలకు దాతలు ముందుకు వచ్చి సహకరిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్ అన్నారు. పోచమ్మ ఆలయ నిర్మాణం పనులను ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. కౌన్సిలర్ నర్సింహాగౌడ్, సదానంద్‌గౌడ్, లక్ష్మయ్యయాదవ్, యాదయ్య, తదితరులున్నారు.

యాచారం : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హోంశాఖ ప్రతీ పోలీస్ స్టేషన్‌లోని సీఐ, ఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు పోలీస్ పతకాలు పంపించింది. పతకాలను యాచారం సీఐ శంకర్‌కుమార్ తన సిబ్బందికి అందించారు.

ఆమనగల్లు : శెట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు బుధవారం ఆమనగల్లుకు వచ్చిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

యాచారం : మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు డొనేషన్ల పేరుతో లక్షల్లో ఫీజులు తీసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆలంపల్లి జంగయ్య, విప్లవ్‌కుమార్‌లు యాచారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎమ్మార్సీ రాధకృష్ణకు వినతిపత్రమందించారు.

శంషాబాద్ : మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నాయకుడు మల్లేష్ మాట్లాడుతూ కార్మికులకు ఐదు మాసాలుగా బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.

శంషాబాద్ రూరల్ : మధ్యాహ్న భోజన కార్మికులను ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటానే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నీరటి మల్లేష్ ఎంఈవో రాంరెడ్డి లేకపోవడంతో కార్యాలయంలోని సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్మికులు కొన్ని నెలలగా అప్పులు తెచ్చి పిల్లలకు భోజనం పెడుతున్నారని, స్కూల్స్ ప్రారంభమయ్యాయని, తిరిగి అప్పులు తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మండలాధ్యక్షుడు గణేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మంచాల : ఆగాపల్లిలోని అల్లీ చెరువును కబ్జాచేసిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యకార్మిక సంఘం నాయకులతో కలిసి తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : జిల్లాలో ఆగిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఇదే షెడ్యూల్లో కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తాపస్ జిల్లా అధ్యక్షులు కోట్ల కాశీరావు కోరారు. జిల్లాలోని కొందరు ఉపాధ్యాయుల స్వార్థం మూలంగా అందరికీ నష్టం చేకూర్చడం తగదని అన్నారు. పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో చాలామంది ఒకే ప్రాంతంలో 14 ఏళ్ల తరబడి పనిచేయడం వల్ల కొంత స్తబ్దత ఏర్పడిందన్నారు.

చేవెళ్ల : తెలంగాణ మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు కనీస వేతనం ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు విద్యాశాఖ కమిషనర్ దేవసేన కలిసి వినతిపత్రం అందించారు. జనరల్ సెక్రెటరీ రాగవేందర్‌రెడ్డి, సభ్యులు తదితరులు ఉన్నారు.

నందిగామ : ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిని నందిగామ మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పద్మారెడ్డి, విఠల్, అశోక్, శ్రీశైలం, గోవిందు అశోక్, నర్సింలు, బండి రాజు, సురేష్, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.